3

ఒంటెద్దుబండి

గాలివాన రావచ్చు.

ఎండ లెక్కువై, వడగాడ్పులకు నాలుక పీక్కుపోయి హైరాన పడవచ్చు.

బస్సుల రాకపోకలు ఆగిపోవచ్చు. కలకతా మెయిలూ, గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్సూ ఆలస్యం కావచ్చు. వారమో పదిరోజులో అసలు రాకనేపోవచ్చు.

నాగరీకయుగంలో మామూలైన విశేషా లివి.

ఈ విశేషాలకు కారణాలు మీకు తెలుస్తయ్.

వీటికి బాధ్యులైనవారి సంగతిని విచారిస్తారు. దర్యాప్తులూ, తనిఖీలూ, బహిరంగ విచారణలూ జరుగుతయ్. ఆధారాలూ, సాక్ష్యాలూ ఉంటయ్ వీటికి. కాని ముసలయ్య ఒంటెద్దుబండి సంగతి మాత్రం చాలామందికి తెలియనే తెలియదు. బండి సంగతే తెలియకపోతే ఇక ముసలయ్య సంగతేం తెలుస్తుంది? తెలిసే అవకాశ మేదీ? ప్రధానమంత్రి కాడు ముసలయ్య. ముఖ్యమంత్రి

అయినా కాడు ముసలయ్య. పైగా ఆ ఒంటెద్దుబండి నవనాగరీకతకు శత్రువు. అందుకనే ముసలయ్య సంగతీ, ఒంటెద్దుబండి సంగతీ ఎవరూ దర్యాప్తు చెయ్యరు. చెయ్యలేరు.

అయినా ఇదంతా ఊకదంపుడు గొడవ కాని, ఎంతమంది లేరూ ముసలయ్య లీ స్వతంత్ర భారతంలో! ఒంటెద్దు బండ్లు తోలిన, తోలుతున్న ముసలయ్యలు లక్షలకు లక్ష లుంటారు. కాకపోతే ఇప్పుడిప్పుడే ఒంటెద్దుబండ్లు మోటారు, సైకిల్ రిక్షాలూ, నరవాహనాలూ అవతరిస్తున్నయ్. అయినా నరవాహనాలను లాగుతూనే ఉన్నారుగా. ఇటువంటి ముసలయ్య సంగతి ఓ పురాణ మైనట్టు చెప్తాడేం వీడూ ?

తెల్లవారలేదు. చీకటి లేదు. ఇంకా అందరూ నిద్ర లేవ లేదు. మంచాలమీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నారు.

పళ్ళబిగువున సంసారం లాక్కొస్తున్న పుల్లయ్య మోతుబరి రైతే. అంత చీకటుండగా మంచంమీదనుంచి లేవవలసిన మనిషి కాదు. ఓపికా లేదు. అయినా పుల్లయ్య ఎందుకో గభాలున మంచంమీదనుంచి లేచి కొడుకు పడు కునే చావట్లోకి వెళ్ళాడు. "రాములూ" అని పిలిచాడు.

"అప్పుడే వెళ్ళారు దొరా" అన్నాడు పాలేరు వెంకయ్య.

"అప్పుడే వెల్లాడా ? ఎందుకెళ్ళనిచ్చావ్ ? ఆడు లేవగానే నన్ను పిలవమని చెప్పలా ?"

"చెప్పారు దొరా! ఆరు లేచేప్పటికి నేనే ఇంకా లేవలేదు దొరా!"

"ఏడవక పోయావ్ ! ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి లేదు. మనిషికో మాటా, గొడ్డుకో దెబ్బా! ఛా! ఏం బతుకురా ఇదీ!"

....

"ఆ డసలు రాత్రి ఎప్పుడొచ్చాడో ?"

"తెల్దు దొరా! నాను తొంగున్నాక వచ్చారు. ఓరాత్రప్పుడు గొడ్లకు మేతెయ్యడానికి లేస్తే మంచంమీద పడుకోనున్నారు."

"మరి గిత్తకు మేతా నీళ్ళు?"

"ఆరే పెట్టుకున్నారేమో!"

"ఆ బుట్టలో ఉలవ లున్నయ్యేమో చూడు."

"లేవు దొరా! ఇందాకనే చూశా."

"అసలు రాత్రి ఉలవలు ఉడకేశారా ?"

"ఉడకేశారు దొరా. ఎడ్లకు పెట్టి మూడుసోలలు ఈ బుట్టలో పోసి ఆడ పెట్టినా దొరా!"

"సరేలే... కానియ్. కానియ్. ఇంకా దొడ్డ ఊడవ లేదుగా!"

"ఇదుగో పోతుండా దొరా!"

* * * *

"రామారావు వచ్చాడా ?"

" ఏ రామారావూ ?"

"అయిందీ, అంతవరకూ వచ్చిందీ ?"

"అవును. పుల్లయ్యగారి రామారావు పేకాట మానేసి ఎన్నాళ్లయిందీ ? ఇవాళ కొత్త అయినట్టు 'రామారావు రాలేదా' అని అడిగితే ఏం చెప్పాలీ ?"

"అవున్రా......రామారావు పేకాట మానేశాడు. ఊళ్ళో కనిపించడం లేదు. ఊళ్ళోనే కాదు, అసలు ఇంట్లోనే ఉండడంలేదు. ఆ ముసలాడితో కూడా సరిగ్గా పలకడం లేదట. దిగులుపడుతున్నాడు పుల్లయ్య."

"ఏం ? ఏమొచ్చిందీ ? దిగు లెందుకూ ?"

"ఆగవోయ్ రంగయ్యా, ఆగు. పుల్లయ్యబాధ నీ కర్థం కాదు. ఒక్కగా నొక్క కొడుకు. తీరా చదువు ఈడు వచ్చేప్పటికి పుల్లయ్య ఆస్తంతా హరాయించుకుపోయింది. రామారావూ, నేనూ కలిసి చదువుకున్నాం, తెలుసుగా. అన్ని క్లాసులలోనూ వాడికి ఫస్టుమార్కులే వచ్చేవి. స్కూల్ ఫైనల్ తోనే మానేశాడు."

"పోనీ లెద్దూ. హాయిగా పొలం దున్నుకుంటాడు."

"నిజమే, పొలం దున్నుకోవచ్చు. కాని, పొలం అనేది ఉండాలి కదా ?"

"అంటే ?"

"అంటే యేముందీ ? మీ తాత నాడు మీకు ఎంత పొలం ఉండేది ? మీ నాయనావాళ్ళు ఎంతెంత పంచు

కున్నారూ? ఈనాడు మీ కెంత పొలం ఉన్నది?''

''ఏడిసినట్లుంది నువ్వు చెప్పేది. పుల్లయ్య ఒక్కడే వాళ్ళ నాయనకు కొడుకు. వాళ్ళకి ఎంత లేదన్నా ముప్ఫయి ఎకరా లుండాలి తెల్సా?''

''అయినా ఈ గొడవంతా ఎందుకురా! రామారావు సంగతి చెపుదూ? ఆడు ఇంటిపట్టున ఎందుకు ఉండడం లేదు? తండ్రితో కీచులాడేడా?'' అన్నాడు కోటయ్య.

''అబ్బే! పుల్లయ్యఎదటపడి మాట్లాడడు రామారావు. ఎంత సేపటికీ అక్కగారే అన్నీ చూడాలి'' అన్నాడు రోశయ్య.

''మరి ఇంటిపట్టున ఎందుకు ఉండడం లేదు? పొద్దున్నే ఆ ఒంటెద్దు బండి కట్టుకుని బస్తీ కెందు కెళ్తున్నాడూ?''

''ఓస్! ఏముంది లేవోయ్. కాఫీ హోటలయ్యా! కాఫీకోసం బస్తీ కెళ్తున్నాడు.''

''నీదంతా చాదస్తం బాబాయ్! కాఫీకోసం బస్తీకి వెళ్ళాలా యేం? కోమటిరామయ్య హోటలు లేదా?''

''హోటల్లో కాఫీతాగే ఖర్మం వాడి కేం పట్టింది? అప్పతో చెబితే కాఫీయే కాదు—వాడు ఏమి ఇవ్వమన్నా ఇస్తుంది.''

''మరి ఎందుకు వెళ్తున్నాడంటావ్? వెళ్ళినవాడు అర్థరాత్రి దాకా ఎందుకు తిరిగిరావడం లేదూ?''

''అదే పుల్లయ్య దిగులు.''

''మళ్లీ అదేమాట అంటావేం? దిగులెందుకంటాను?''

అన్నాడు సాంబయ్య.

"ఎందుకేమిటశా? అయ్యగారు బస్తీలో దేని వెంటనో పడాడు. ఇక ఇల్లెందుకు చెప్పా!" అన్నాడు రంగయ్య.

"బాబూ, రోశయ్య దొరా, మిమ్మల్ని మా దొర పిలుత్తుండాడు" అన్నాడు, పుల్లయ్యగారి పాలేరు వెంకయ్య అక్కడికొచ్చి.

రోశయ్య పేకాటనుంచి లేవగానే అతనికి బదులు సాంబయ్య కూర్చున్నాడు. పేకాట జరిగిపోతోంది.

*   *   *

"మాధవీ!"

"తాతా!"

"మామ రాత్రొచ్చాడా?"

"వచ్చాడు తాతా! పూలూ, మామిడిపండ్లూ, వోణీ తెచ్చాడు."

"అందాకా నువ్వు మేలుకునే ఉన్నావా తల్లీ!"

"లేదు తాతా. అమ్మ దగ్గరే మంచంమీద పడు కున్నాను. మామ వచ్చి లేపాడు. నేనే వేడినీళ్లు పెట్టేను. స్నానం చేశాడు. బువ్వ తిన్నాడు."

"అమ్మ యేం చేస్తోంది?"

"ఏం నాన్నా...ఏం కావాలీ?"

"ఏమీ వద్దమ్మా. రాములు సంగతే...ఇంటి పట్టున ఓ గంటయినా ఉండడం లేదు. ఆ గిత్త బండితో రోజూ బస్తీ వెళ్తున్నాడు. అర్ధరాత్రి దాకా తిరిగి రావడం

లేదు..."

"అదా...అందుకేనా దిగులు నాన్నా! మరేం భయంలేదు నాన్నా!"

"అదేంటమ్మా...అట్లా అంటావ్! రోజులు బాగా లేవు. పొద్దస్తమానం బస్తీలోనే ఎవరితో తిరుగుతున్నాడో? పగలుతిండి ఎక్కడో? మీ అమ్మ పోయిం దగ్గర్నుంచి మీ ఇద్దరినీ..."

"అవును నాన్నా. నాకు తెలుసు. ఇంతకూ ఇప్పు డొచ్చిన దిగులేమిటి?"

"రాముడు పగలల్లా బస్తీలో ఏంచేస్తూంటా డంటావ్?"

"బస్తీలో నీకు తెలిసినాళ్ళు చాలామంది ఉండా రుగా. కనుక్కోకపోయావ్?"

"పైగా అదొకటా? అదో అప్రతిష్ఠ!"

"అప్రదిష్ఠేంది నాన్నా! తమ్ముడేంచేశాడూ? ఏం చేస్తున్నాడంటావ్?"

"నువ్వు దాచినా దాగదమ్మా...కుండను మూయ గలంగాని, లోకాన్ని మూయగలమా?"

"ఏమంటున్నారు నాన్నా!"

"బుల్లీ, దాడ్లో వెళ్ళమ్మా...ఆడు దేనినో మరిగా డని..."

"..............................."

"నే నేం చెయ్యను తల్లీ! ఒఖ్ఖగా నొఖ్ఖ ఆడ

పిల్లవు. నీఖర్మ ఇట్లా కాలి నాపంచన పడ్డావ్. ఆ డొక్కాడే మగనలుసు. ఆడుకూడా..."

"................................."

"కనుక్కుంటా...దీని అంతు కనుక్కుంటా. పుల్లయ్య ఆస్తంతా అప్పులపాలైంది. పుల్లయ్యంటే ఓనాడు ఈ ఊరికి కిరీటంలేని రాజు..."

"ఇంతకూ ఇదంతా అనుమానమేగాని, ఆధారమేంటి నాన్నా!"

"ఆడి స్నేహితుడు రోసిగాడు తెలుసుగా నీకు... ఆడికే అనుమానంగా ఉన్నది."

"మరి రాముణ్ణి పై చదువుకు ఎందుకు పంపించలేదు నాన్నా?"

"పంపిస్తానన్నా. 'నేను చదవ'నన్నాడు. 'చదివి చేసేదేం'టన్నాడు. పోనీ లే, యింటిపట్టునవుండి మిగిలిందేదో చూచుకుంటాడనుకున్నా. ఈ యేడు బుల్లికీ ఆడికీ ముడేసేద్దాం అనుకున్నా..."

"..........................."

"ఇయ్యాల నేను బస్తీకెళ్లొస్తా. సరేనా?"

"వెళ్లిరా నాన్నా. తొందరపడకు. అనుమానంతో వాడినేమీ అనకు."

*　　　*　　　*

రామారావు అనే యువకుడి జీవితవివరాల పరిశోధన అట్లా ఇంటా, బయటా ప్రారంభమైంది. కాని, ఎవరికీ

ఏమీ అంతు చిక్కలేదు.

ఊళ్లోవాళ్లు రకరకాలుగా చెప్పుకుంటున్నారు. పుల్లయ్య పొలంలో చాలా భాగం అప్పులకింద సరిపోయింది. అయిదెకరాలు మిగిలింది. ఒక ఇల్లుకూడా వేలంలో పోయింది. ఇంత అప్పు ఎందుకయిందో ఎవరికీ తెలియదు. తెలిసినా బయటికి అనరు. ఎందుకు అనరో తెలియదు. తన ఆస్తి అంతా అట్లా హరించుకుపోతున్నా రామారావు తండ్రిని పల్లెత్తుమాట అనలేదు. కాకపోతే ఇంటికి రోజూ రావడం మానేసి రెండురోజులకొకసారి వస్తున్నాడు. అప్పుడప్పుడు మాధవికి చీరే, పూలూ, పండ్లూ తెస్తాడు. "ఇంటిపట్టునే ఉండ్రాదుట్రా" అని పుల్లయ్య ఓనాడు అరుచుకున్నాడు. రామారావు జవాబేమీ చెప్పలేదు. ఆయన కేకవేసినంతసేపూ అట్లా మొద్దల్లే నుంచున్నాడు. అదంతా అప్పకు ఆశ్చర్యమే కలిగించింది. కాని, లోకులన్నదాంట్లో నిజం లేదనిమాత్రం ఎందుకనో ఆమె గట్టి నమ్మకం.

ఈనోటా, ఆనోటా ఈ వదంతులు మాధవి చెవిదాకా కూడా పోయినా, మాధవి నమ్మలేకుండా ఉన్నది. మామకు తనంటే ప్రాణం. ఇంట్లో ఎవళ్ళతోనూ మాట్లాడని రోజులయినా ఉన్నయ్ కాని మామ తనతో మాట్లాడని రోజు అనేదే లేదు. తల్లిప్రోద్బలంమీద పెళ్లి సంగతి ఎత్తితే మామ బిగ్గరగా నవ్వాడు. నవ్వి, "పిల్లా, బస్తీ కెళ్దాం. ఈ వూళ్లో బతకలేం. పెళ్ళంటే మాటలా! నాన్న మళ్ళీ ఏ ఎకరమో రెండెకరాలో అమ్మి ఊళ్ళో

వాళ్ళందరికీ సంతర్పణ చెయ్యాలి. అవన్నీ ఎందుకూ? మాధవీ, నాకోసం నువ్వూ...నీకోసం నేను. సరేనా'' అన్నాడు. ఆహా...ఆమాటలు వింటుంటే ఎంత హాయి! అంతేకాని, బస్తీలో ఏంచేస్తున్నాడో మామ చెప్పడు. అసలు మామ ఏ బస్తీకి వెళ్తున్నాడో తెలియదు. ఇద్దరు ముగ్గురికి ఓ బస్తీలో మామ కనిపించాడు. కాని, అక్కడ ఏంచేస్తున్నాడో వాళ్ళకు తెలియదు. ఎవరూ ఎదుటపడి అడగలేనంతగా రామారావు మారిపోయినాడు. ఎప్పుడూ ఏదో దిగులుగా, గంభీరంగా, కోపంగా ఉంటుంది మొఖం. అటువంటివాడి ఎదుటికి వెళ్ళి ''బస్తీలో నువ్వు ఏం చేస్తున్నావ్?'' అని ఎవరు అడగ్గలరూ?

*   *   *

చాలా ఆశ్చర్యం. ఓ తెల్లవారుజామున రామారావు మామూలుగా బండి తోలుకెళ్తూ అప్పనూ, మాధవినీ కూడా బండిలో ఎక్కించుకు వెళ్ళాడు. పుల్లయ్య లబలబలాడాడు. నెత్తీ నోరూ కొట్టుకు ఏడ్చాడు. కనిపించినవాళ్ళందరినీ తిట్టాడు. ఆఖరికి రెండుమూడు బస్తీలకు మనుషులను పంపించాడు...

తన మామ నిజంగా ఓ ఇల్లు కడతాడని మాధవి ఎన్నడూ అనుకోలేదు. తన తమ్ముడు మైసూరు గిత్తలతో ఎడ్లబండ్ల బాడుగ వ్యాపారం పెడ్తాడని అప్ప ఎన్నడూ అనుకోలేదు. అదే అదే ఒంటెద్దుబండి ముసలయ్యకథ. నిజాయతీపరుడైన రామారావు ఇతరులను సంస్కరించాలని

అనుకోలేదు. తనను తానే సంస్కరించుకున్నాడు. స్వ గ్రామంలో ఈనాటికి ఓ అర ఎకరం పొలం ఉన్నది. భూమి సంస్కరణల భయం రామయ్యకు లేకపోలేదు. ఆ భయం రాణకు రాని భయం. ఆందోళన చేయలేని భయం.

అయితే రామారావు అమాంతం ఒంటెద్దుబండి బాడుగకు తోలడం మొదలెట్టలేదు. తన బండితో బస్తీకి వెళ్ళి అక్కడ ఓ మనిషి చేత బండిని బాడుగకు తోలించే వాడు. రోజుకు రూపాయి వాడికి ఇచ్చినా సులభంగా మూడురూపాయలు మిగిలేవి. రామారావు బండి తోలక పోవడంవల్ల అన్వేషకులకు బస్తీలో అతను దొరకలేదు...

ఈనాడదంతా యేమీ లేదు. రామారావు రామయ్య అయి, ముసలయ్య అయినాడు. ఎవరు పిలిచినా బండికడ్తాడు. నలుగురు పిల్లల రామయ్య ! ఆ ఒంటెద్దుబండి జీవితం అట్లా సాగిపోవలసిందే. నాగరికతకు ఎదురీతే కావచ్చు. కాని, సంస్కరణలకు మాత్రం అనుకూలమే గదా !